క్లుప్తంగా

'కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్'

రఘునాథపల్లి: అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని రాష్ట్ర భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ.5 వేల పింఛన్, రూ.15 లక్షల ఇన్సూరెన్స్, ఈఎస్ఐ సౌకర్యం, వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేసి దానికి టీబీఎన్ఆర్‌కేఎస్ అధ్యక్షుడు దరిపెల్లి చంద్రంను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లోని ఏఎస్‌రావునగర్ లైబ్రరీ హాల్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించనున్నందున సంఘం ముఖ్యనాయకులు హాజరు కాగలరని ఆయన పిలుపునిచ్చారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

రఘునాథపల్లి: ధర లేక తీవ్రంగా నష్టపోతున్న పొగాకు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీర్రు నాగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన రఘునాథపల్లి సీపీఐ మహాసభలో ఆయన మాట్లాడారు. గత ఏడాది పొగాకు క్వింటాల్‌కు రూ .15 వేలకు పైగా ఉంటే ఈ సారి వ్యాపారులు రూ. 5 వేల నుంచి రూ .10 వేల లోపు కొనుగోలు చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, ఉన్నతాధికారులు స్పందించి రూ .15 వేల నుంచి రూ. 20 వేల వరకు కొనుగోలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి గ్రామశాఖ కార్యదర్శిగా సులుగు రమేష్, సహాయ కార్యదర్శిగా బీర్రు నాగేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పేర్ని ఐలయ్య, కురాకుల రాములు, అరూరి గాలయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

చిల్పూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని రిటైర్డ్ హెచ్‌ఎం కేతిడి నరసింహారెడ్డి అన్నారు. పల్లగుట్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పెనుమాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా నరసింహారెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీ షర్టుల పంపిణీ

జఫర్‌గఢ్: కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత గంటా రవీందర్ సహకారంతో స్పోర్ట్స్ టీషర్టులను బుధవారం ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోషల్ వర్కర్ డాక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలన్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

పాలకుర్తి టౌన్: అంగన్‌వాడీల హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జయలక్ష్మి మాట్లాడారు. ఈ సందర్భంగా కొడకండ్ల ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు వివిధ యూనియన్ల నుంచి 200 మంది సీఐటీయూలో చేరారు. యాటల సోమన్న, జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, విజేందర్, చిట్యాల సోమన్న, స్వరూప, సరిత, భాగ్య, శోభ రాణి, మంగ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చిల్పూరు: పల్లగుట్ట గ్రామానికి చెందిన దారం చంద్రమౌళి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు బాధిత కుటుంబానికి పంపించిన రూ. 5వేల ఆర్థికసాయం పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు అందజేశారు. రత్నాకర్‌రెడ్డి, సుధాకర్, అశోక్‌పాల్, దార రాజు, రాజు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



సాయి (ఫైల్)

లింగాలఘణపురం: నవాబుపేటలో విషాదం అలముకుంది. ఈ నెల 21వ తేదీన జనగామ నుంచి ద్విచక్రవానంపై నవాబుపేటలోని ఇంటికి వస్తున్న కల్యాన్, సాయి అనే ఇద్దరు యువకులను కుందారం క్రాస్ రోడ్డులోని గుడిసెవాసుల కాలనీ వద్ద కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అదే రోజు బోళ్ల కల్యాణ్ మృతి చెందగా బూడిద సాయి (29) తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఎనిమిది నెలల కుమారుడు ఉన్నారు. సాయి మృతితో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

శిలాఫలకాలకే పరిమితం

- తుప్పు పట్టి పోతున్న ఇనుము
- పీహెచ్‌సీల నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు



తుప్పు పట్టిన స్టీల్



శిలాఫలకం

నర్మెట: భూమి పూజ చేశారు.. శిలాఫలకాలు వేశారు కానీ నిర్మాణ పనులు మాత్రం మరిచారు. మండల కేద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా మచ్చుపహాడ్, హన్మంతాపురం, గండిరామారం, ఆగాపేటలలో ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ. 20 లక్షల అంచనా వ్యయంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలకు రెండేండ్ల క్రితం భూమి పూజలు నిర్వహించారు. మచ్చుపహాడ్, హన్మంతాపూర్‌లలో నిర్మాణాలు పూర్తి కావడంతో సబ్‌సెంటర్లలో సేవలను ప్రారంభించారు. కాగా, గండిరామారం, ఆగపేటలలో పునాదులు తీసినా, ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో చిన్న జ్వరం వచ్చినా ప్రజలు మండల కేంద్రానికి పరుగులు తీయక తప్పడంలేదు. వెల్దండలో రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మాణం చేపట్టిన భవనం పూర్తి కాకపోవడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో 15వ ఆర్థిక (ఎఫ్‌ఎఫ్‌సీ) సంఘం నిధులతో మరో నూతన భవణ నిర్మాణ పనులు చేట్టారు. త్వరితగతిన హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కొరతతో పనులు నిలిచి పోయాయి..



సకాలంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడం, నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. రెండు పర్యాయాలు కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చాం. ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ. కోటి మంజూరు అయ్యాయి. మరోసారి నోటీసులు జారీ చేసి పనులు ప్రారంభిస్తాం.

\- గురిజాల ప్రదీప్ కుమార్, ఏఈ, పీఆర్

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఆలయానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

రఘునాథపల్లి: దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం రామచంద్రగూడెంలో మల్లికార్జునస్వామి, మడేలేశ్వరస్వామి దేవాలయాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అదే విధంగా పైలట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపికైన మండలంలోని కన్నాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం కంచనపల్లిలో ఈజీఎస్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మాలోత్ నర్సింహ, మాజీ సర్పంచ్ పయ్యావుల లావణ్యకుమార్, ఎండీ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతికి చర్యలు చేపట్టాలి

దేవరుప్పుల: ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పన కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యంను సత్వరమే ఎగుమతి చేసేందుకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ ఆడెపు అండాలు సూచించారు. బుధవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. రైతులు తెచ్చిన ధాన్యం నిర్దేశిత తేమ శాతం రాగానే హమాలీల కొరత లేకుండా కాంటా వేయాలని సూచించారు. ఇందుకు టోకన్లు సకాలంలో జారీ చేసేలా వ్యవసాయ అధికారులు పాటుపడాలన్నారు. అకాల వర్షానికి నష్టం వాటిల్లకుండా నిర్వాహకులు అప్రమత్త చర్యలు చేపడుతూ అన్నదాతలకు బాసటగా నిలువాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

కేటీఆర్‌కు ఎమ్మెల్యే 'పల్లా' ఘన స్వాగతం



పెంబర్తి వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్-వరంగల్ హైవే జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరం వద్ద ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే నేతృత్వంలో భారీ కాన్వాయ్‌తో కేటీఆర్‌తో కలిసి వరంగల్ వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పోకల జమునలింగయ్య, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, ఇర్రి రమణారెడ్డి, బాల్దె సిద్దిలింగం, డాక్టర్ సుగుణాకర్‌రాజు, తాళ్ల సురేష్‌రెడ్డి, మేకల కలింగరాజు, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, గద్దల నర్సింగరావు, మసిఉర్ రెహమాన్, ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల సందీప్, వడ్డెపల్లి మల్లారెడ్డి, మామిడాల రాజు, ఉడుగుల నర్సింహులు, సలీం, యాకూబ్, దేవునూరి సతీష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తరిగొప్పుల: విద్యార్థులతో లక్ష్మి

తరిగొప్పుల: అబ్దుల్‌నాగారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించినట్లు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ అర్జుల లక్ష్మి తెలిపారు. బుధవారం నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పెద్దల పర్యవేక్షణ లేకుండా చెరువులు, బావుల దగ్గరకు పిల్లలను వెళ్లనివ్వకూడదన్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఆడుకోవాలని సూచించాలని పలు సూచనలు తెలిపారు. అలాగే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు, మెమోంటోస్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో..

దేవరుప్పుల: మండలంలోని ప్రాథమిక పాఠశాల్లో గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. మాధాపురం, పెద్దమడూరు, ధర్మగడ్డతండాలోని ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఏంలు నల్ల లలిత, పద్మకుమారీ, జోగు వరప్రసాద్‌లు విద్యార్థులకు పై తరగతుల ప్రవేశాలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

తల్లిదండ్రులు పిల్లలను గమనించాలి

బచ్చన్నపేట: తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన పాల్గొని విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. అనంతరం మాట్లాడుతూ వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఇంటిపట్టునే ఉండేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ కొమురయ్యకు మధ్యాహ్నభోజన వంట కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షురాలు ఎండీ.ఖలీదాబేగం మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహించే వంట కార్మికుల ఏజెన్సీలను కొందరు హెచ్‌ఎంలు ఇష్టారాజ్యంగా మారుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దాంతో వంట వండిన కార్మికులకు నెలనెలా డబ్బులు రావడం లేదని, తదుపరి సంవత్సరంలో విడుదల కావడం లాంటి సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయమై ఎంఈఓ సానుకూలంగా స్పందించాలని, మధ్యాహ్న భోజన కార్మికుల ఏజెన్సీలను మార్చవద్దని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు భాగ్యలక్ష్మీ, నాగమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ

లింగాలఘణపురం: కిష్టగూడేనికి చెందిన ఓ దినపత్రిక రిపోర్టర్ మార్తాల నర్సింగరావు తండ్రి మార్తాల సోమాజీ ఇటీవల మృతి చెందగా బుధవారం రాత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆ కుటుంబాన్ని పరామర్శించారు. సోమాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ ఉపేందర్, రాజు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జరిమానా, జైలు

పాలకుర్తి టౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన అనంతోజు రాముకు రూ.1,000 జరిమాన, ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై లింగారెడ్డి బుధవారం తెలిపారు. విస్నూరు రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద పోలీసుల తనిఖీలో అతిగా మద్యం సేవించి వాహనాన్ని నడుపుతున్న రాముపై కేసు నమోదు చేయగా జిల్లా కోర్టు జరిమాన, ఒక రోజు జైలు శిక్ష విధించిట్లు ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వ వైఫల్యంతోనే ఉగ్ర దాడులు'

కొడకండ్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం వల్లనే ఉగ్రవాద దాడుకు చోటు చేసుకుంటున్నాయని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మసురం రవీందర్, మార్కెట్ డైరెక్టర్ దేశగాని నాగరాజులు ఆరోపించారు. బుధవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల భద్రతలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్న దానికి జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి నిదర్శనంగా నిలుస్తుందని, దేశ భద్రతపై ఉగ్రవాదులతో రాజీలేని పోరాటం చేసి ప్రజలకు భద్రత కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. భిక్షపతి, రంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులకు పోలీసుల నోటీసులు

పాలకుర్తి టౌన్: మండలంలోని వివిధ గ్రామాల్లో డీజే సౌండ్ సిస్టం యజమానులకు బుధవారం వరంగల్ పోలీస్ కమిషర్ శ్రీసన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు పవన్‌కుమార్, లింగారెడ్డి ఆధ్వర్యంలో నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై లింగారెడ్డి మాట్లాడుతూ ఫంక్షన్ హాల్‌లో డీజే సౌండ్ సిస్టం, పబ్లిక్ మీటింగ్, పెళ్లి ఊరేగింపుల్లో, వివిధ మతాలకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో పోలీసుల అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టం పెట్టవద్దని తెలిపారు. ఒకవేళ పోలీసు అనుమతి తీసుకుని డీజే సౌండ్ సిస్టం పెట్టిన భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు పగటి పూట 55 డిసబుల్స్‌లోపు, రాత్రి 10 గంటల లోపు 45 డిసిబుల్స్ లోపు సౌండ్ లెవెల్స్ పెట్టుకోవాలని ఫంక్షన్ హాల్ యవమానులకు, డీజే సౌండ్ సిస్టం నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో | మెరిసిన పేదింటి విద్యా కుసుమం

- బైపీసీలో 973 మార్కులు సాధించిన కూలీ కుమార్తె



తల్లిదండ్రులతో రవళి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని కర్నె రవళి ఉత్తమ ప్రతిభ చాటింది. ఘన్‌పూర్ శివారు నమిలిగొండలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ చదివిన రవళి ఉత్తమ ప్రతిభతో ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 973 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్‌కు చెందిన కర్నె రవీందర్, శ్రీలతల కుమార్తె రవళి స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ చదివింది. రవీందర్ ఓ రైస్ మిల్లులో కూలీగా పనిచేస్తుండగా శ్రీలత టైలరింగ్ పనిచేస్తోంది. నిరుపేద కూలీ కుటుంబం నుంచి వచ్చిన రవళి చిన్ననాటి నుంచే చదువులో ఉత్తమ ప్రతిభ చాటుతూ వచ్చింది. పదో తరగతిలోనూ ఉత్తమ ప్రతిభ చాటిన రవళి ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో ఉత్తమ ప్రతిభతో 973 మార్కులు సాధించి అందరి మన్ననలు పొందుతుంది. కాగా, ఉత్తమ మార్కులు సాధించిన కుమార్తెను తల్లిదండ్రులు, స్థానికులు అభినందిస్తున్నారు.

డాక్టర్ కావడమే లక్ష్యం : రవళి

తల్లిదండ్రులు కూలీ పనిచేస్తూ కష్టపడి నన్ను చదివిస్తున్నారు. కష్టపడి చదివి డాక్టర్ కావడమే నా లక్ష్యం. ఎలాగైనా డాక్టర్ చదువు చదివి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయం.

దివ్య ప్రతిభ



దేవరుప్పుల: కడవెండికి చెందిన చెన్నూరి దివ్య ఇంటర్ మొదటి పరీక్షల ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 470కి 466 మార్కులతో ప్రతిభ కనబర్చింది. చేనేత కుటుంబానికి చెందిన దివ్య తండ్రి కొండయ్య రెండేళ్ల కిందట అకాల మృతి చెందడంతో తల్లి కళావతి ఇంటర్ హనుమకొండ జిల్లా కమలాపురంలోని కస్తూర్బా బాలికల గాంధీ గురుకుల విద్యాలయంలో చేర్పించింది. కుటుంబ స్థితిగతులతో విద్యయే ఏకైక మార్గమనే లక్ష్యంతో రాష్ట్రస్థాయి మార్కులు పొందడం పట్ల గ్రామస్తుల అభినందించారు.

బాధిత కుటుంబాలకు రూ.1.20 లక్షల సాయం



రమేశ్ కుంటుబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గత నవంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన అటెండర్ రమేశ్ కుటుంబానికి రూ.60 వేలు, మల్లంపల్లి ఆవాస ప్రాంత కురుమగూడెం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన జి.కరుణాదేవి కుటుంబానికి రూ.60 వేలు బుధవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్థిక సమయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఇమ్మడి అశోక్, వీరమల్ల బాబయ్య, వడ్లకొండ శ్రీనివాస్, దేవగిరి సూర్యప్రకాశ్, పోగు వెంకటనర్సయ్య, చిదురాల శ్రీనివాస్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, అధికారులు



నర్మెటలో..

- తహసీల్దార్ వెంకటేశ్వర్లు

స్టేషన్‌ఘన్‌పూర్: గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లలకు ప్రీస్కూల్ విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్టేషన్ ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సమతుల ఆహారం, చిరుధాన్యాల ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఆరు నెలల వయస్సు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఐకేపీ ఏపీఎం కుమారస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు మునిగాల రాణి, ధనలక్ష్మీ, ప్రభ, స్వరూప, సువర్ణ, వీఏఓలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నర్మెట: సమతుల ఆహారం, సరైన పోషణతోనే తల్లీ పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ రమాదేవి అన్నారు. పోషణ పక్షోత్సవంలో భాగంగా కన్నె బోయినగూడెం మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణీలు, బాలింతలు, పిల్లల తల్లులకు పలు సూచనలు చేశారు. మిషన్ శక్తి జిల్లా కో ఆర్డినేటర్ శారద, ఎంఈఓ ఐలయ్య, వైద్యాధికారి డా. ఉదయ్ కిరణ్, జీపీ ప్రత్యేక అధికారి సుకన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతాదేవి, హెచ్ఎస్‌లు భాగ్య , పద్మ, ఏఎన్ఎం అమృత ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించాలి

బచ్చన్నపేట: చిన్నారులను తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, ప్రేమలత కోరారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, మరియమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: అంగన్‌వాడీ కేంద్రాల సేవలతో మహిళల అభ్యున్నతి జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. పెద్దమడూరు, ధర్మగడ్డ తండాలో పోషణ పక్షోత్సవాల్లో పలువురి మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైద్యురాలు శ్రీలక్ష్మీ,మమత, హెచ్‌ఎంలు పద్మరాణి, వరప్రసాద్, యోగ టీచర్ నాగమణి పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి



బచ్చన్నపేట: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

జఫర్‌గఢ్: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సభకు మండలం నుంచి 3 వేల మందిని తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కోత్వాల కుమార్, ఎస్ శ్రీధర్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట: రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని బండనాగారంలో సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రాజనర్సు, రవికుమార్, జనార్ధన్ పాల్గొన్నారు.

ఓరుగల్లు సభతో బీఆర్ఎస్‌కు పూర్వవైభవం ఖాయం

దేవరుప్పుల: ఓరుగల్లు రజతోత్సవ సభతో బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ఖాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేషం అన్నారు. కడవెండిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నక్క రమేష్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చింత రవి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దుబ్బాక హరీష్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రజతోత్సవ సభ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని,. మండలం నుంచి 5 వేల మందిని తరలించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



గ్రూప్-1 ర్యాంకర్ గీతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు ప్రణాళికతో కష్టపడి చదవాలని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని ఒయాసిస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం ఘనంగా స్కూల్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాలలో 2016-17 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన కొడారి గీత ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1లో మొదటి ప్రయత్నంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభతో 121వ ర్యాంకు సాధించిన సందర్భంగా గీతను, ఆమె తల్లిదండ్రులైన కనకయ్య, రజితను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. అదే విధంగా మంగళవారం విడుదలైన ఇంటర్ ప్రథమసంవత్సరంలో ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాల పూర్వ విద్యార్థులైన జె.హాసిని(468), కె.అంజలి(466), ఎ.నవ్య(465)లను సన్మానించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న రవీందర్

పాలకుర్తి: మండలంలోని వావిలాల ప్రాథమిక పాఠశాలకు ఐదు కంప్యూటర్లను మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ బుధవారం బహూకరించి వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం తండ మల్లయ్య, రాశాల లింగమ్మ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రాజ్‌కుమార్, శ్రీ గౌరి, రాజమణి, మహేందర్, శీల లింగయ్య, విధ్యార్థులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



మాట్లాడుతున్న కనకారెడ్డి

జనగామ రూరల్: పహల్గాం బైసారన్ ప్రాంతంలో పర్యాటకులను దారుణంగా చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి కేంద్ర ప్రభుత్వంను డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో పాటు అమాయక ప్రజలను దారుణంగా చంపడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. దాడికి దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాశ్, చందు నాయక్, బాల్నెవెంకట మల్లయ్య, అజ్మీరా సురేష్ నాయక్, యాకన్న రాథోడ్, బండ సౌందర్య, కొండ వరలక్ష్మి, చింతకింది సోమేష్, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.